క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. 96వ వార్డు రెల్లి కాలనీలో రూ.3 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ, పైపులైను పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానికులు డ్రైనేజీ సమస్యలను తన దృష్టికి తీసుకురాగా పనులకు జీవీఎంసీ నిధులు కేటాయించినట్టు చెప్పారు. త్వరలోనే పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రామునాయుడు, కిల్లి అప్పారావు, లెక్కల రమేష్, ఉమామహేష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీపై నిషేధం

పరవాడ: శాంతి భద్రతల దృష్ట్యా మండలంలో కొవ్వొత్తుల ర్యాలీలను నిషేధించినట్టు సీఐ పి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఈశ్వరరావు హెచ్చరించారు.

అన్నప్రసాద పథకానికి రూ.3.26లక్షల విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్‌వో నాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం బొబ్బిలికి చెందిన వై.శశాంక్ అనే దాత రూ.1,26,500, సింహాచలంకి చెందిన సారిపాక శివసత్య వెంకట నరసింహరామూర్తి అనే దాత రూ.లక్ష , పెందుర్తికి చెందిన రాపర్తి జగదీశ్వరరావు అనే దాత రూ.లక్ష విరాళం అందజేశారు. సింహగిరిపై ఉన్న మే ఐహెల్ప్ యూ కేంద్రంలో ఉద్యోగి రాము, పీఆర్వో నాయుడు దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదంతో పాటు బాండ్లు అందజేశారు.

కార్మిక హక్కులు హరించేందుకే ప్రైవేటీకరణ యోచన



శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉక్కు భూ నిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 947వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు శ్రమించి స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు కేంద్ర ప్రభుత్వం తన స్వార్థం కోసం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలనుకోవటం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌ఎంఎం పార్కులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.21 వేల జీతం దాటిన కార్మికులకు హెల్త్ కార్డులు, బోనస్ చెల్లించాలన్నారు. ఈ అంశాలపై సీజీఎంకు వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు శ్రీనివాసరావు, పిట్టారెడ్డి, పి.భాస్కరరావు, నాగరాజు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపు
- వాడవాడలా మట్టి ప్రతిమల పంపిణీ



తులసి విత్తనాలు కలిపి తయారు చేసిన ప్రతిమలను అందజేస్తున్న లోకేశ్వరానంద మహారాజ్



జోనల్ కార్యాలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వినాయక చవితి పురస్కరించుకుని మట్టి గణనాథుడి ప్రతిమలనే పూజించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వేపగుంటలోని జీవీఎంసీ జోన్– 8 యూసీడీ విభాగం ఆధ్వర్యంలో శనివారం మట్టివినాయక ప్రతిమల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ద్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బందితో పాటు జీవీఎంసీ అధికారులు, సిబ్బందికి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి బొమ్మలను పూజించడం ద్వారా నిమజ్జనం తర్వాత అవి నీటిలో సులువుగా కలిసిపోతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఆదిరెడ్డి మురళి, మెంటి మహేష్, బల్ల రాంబాబు, సూరిశెట్టి సూరిబాబు, నాయకులు వినోద్, దాసరి సత్తిబాబు, అద్దాల రామరాజు, సంపత్ కార్తీక్‌వర్మ, దామర్ల నర్సింగ్ పాల్గొన్నారు.

గణనాథుడి ప్రతిమల అందజేత

పెందుర్తిలోని సాయిదత్త మానస పీఠం ఆధ్వర్యంలో తులసి విత్తనాలు కలిపి మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను పీఠాధిపతి స్వామి సాయిదత్త లోకేశ్వరానంద మహారాజ్ అందజేశారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విగ్రహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మట్టి ప్రతిమలను ఇళ్లలోని పూలకుండీల్లో నిమజ్జనం చేయాలని సూచించారు. మట్టిలో తులసి విత్తనాలు నిక్షిప్తమై మొక్కలు వస్తాయని తెలియజేశారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

సింహాచలం: వినాయక చవితి పురస్కరించుకుని సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయకుడి ప్రతిమలు తయారుచేసే పోటీలు నిర్వహించారు.

- పెందుర్తి చైతన్య టెక్నో స్కూల్లో శనివారం వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ తారకేశ్వరరావు వినాయక చవితి పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఎస్.వి.గోవిందరావు, శేషగిరి పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి



సీఐ రంగనాథం

సబ్బవరం: వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసే వారు విధిగా నిబంధనలు పాటించాలని సీఐ రంగనాథం స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. అనుమతులు పొందిన ప్రాంతాల్లో మాత్రమే మండపాలు ఏర్పాటు చేయడంతో పాటు నిమజ్జనం చేయాలన్నారు. మండలపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని,లౌడ్ స్పీకర్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. మండపాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం,ఊరేగింపు సమయాల్లో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓజోన్ ఆకారంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఓజోన్ పొర ఆవశ్యకత, ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అవగాహన ర్యాలీ, క్విజ్ పోటీలు, డ్రాయింగ్,పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఓజోన్ పొరను కాపాడాలంటే అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావుతో పాటు మిగిలిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు.
- స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవంపై విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నివేదిత,లక్ష్మి, సత్యనారాయణ,గోవిందరావు,ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గంతో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి

సింహాచలం: పెందుర్తి మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఇ.రామలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా కె.లక్ష్మి, సెక్రటరీగా బి.లక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా కనకరత్నం, కోశాధికారిగా పి.గంగాభవాని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పోషణ అభియాన్, న్యూట్రిగార్డెన్స్ పెంపకం గురించి అవగాహ కల్పించారు. కూరగాయల విత్తనాలు అందజేశారు. అలాగే పౌష్టికాహార పక్షోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.శోభారాణి, ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి, ఏపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి ప్రతిమల పంపిణీ

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీ ఆర్చి వద్ద ఆదివారం ఉదయం 8 గంటలకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆయా కాలనీల ప్రజలంతా వచ్చి మట్టి ప్రతిమలు స్వీకరించాలని కోరారు.

సమగ్ర అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

సబ్బవరం: గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని అసకపల్లిలో రూ.20 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సచివాలయ,వలంటీర్ వ్యవస్థల ద్వారా పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మనమంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో సుమారు రూ.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న దోబీ ఘాట్‌కు ఆయన శంకుస్థాపన చేసారు.అలాగే రూ.4 లక్షలతో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, రూ.5 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి పనులతో పాటు మరో రూ.6 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు.వీటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్,ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,దాడి నూకరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు,ఎంపీటీసీ కర్రి అప్పారావు,సచివాలయ కన్వీనర్లు కాపుశెట్టి నీలవేణి,రోమాల పైడిరాజు,ఉప సర్పంచ్ సురేష్, ఏవో పోతల సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ అర్జున అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ జట్టు ఎంపిక



రైఫిల్ షూటింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పరవాడ: పి.బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొనే వివిధ విభాగాల క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.నాగేశ్వరరావు, ఎం.వి.నాగేశ్వర్రావు, పి.సూరిబాబు, డి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను కోచ్‌లు రామ్మోహన్, మనీష్, బషీర్, రాజేష్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు నిర్వహించారు. బాలురు జట్టులో సుందర్రామిరెడ్డి, సురేంద్ర, డేనియల్, చరణ్, అఖిల్, శ్రీమహిత్, జాయేంద్ర, గగన్, భాను ప్రకాష్, సంజయ్, జయప్రకాష్, కార్తీక్, తరుణ్, అక్షయ్, దేవన్, సాయిరవి, మహేష్‌లు ఎంపికయ్యారు. అదేవిధంగా బాలికల జట్టులో మనస్వి, లీలాన్విత, సౌజన్య, హర్షతేజస్వి, వైష్ణవి, హర్షిత, గాయత్రి, త్రిష, కార్తీక, తన్మయిలను ఎంపిక చేశారు. జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల సీఈవో నిశాంత్ అభినందించారు.

రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అకాడమీ నిర్వాహకులు

సబ్బవరం: స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అకాడమీకి చెందిన నితీష్ కుమార్, కిరణ్, ఓం ప్రకాష్, సాయి మొదటి స్థానంలో నిలిచారు. అదే విధంగా త్రోబాల్లో ఓం ప్రకాష్, యశ్వంత్ సత్తాచాటారు. వీరిని శనివారం అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు సూర్యప్రకాష్, లక్ష్మి, మీనాక్షి, పీడీ వెంకటేష్ అభినందించారు.

రోడ్డు సర్వేను వ్యతిరేకిస్తూ ఆందోళన



సరిపల్లి వద్ద నిర్వాసితులతో కలిసి ధర్నా చేస్తున్న దేవిసాంబ, ప్రసాద్ తదితరులు

సింహాచలం: సరిపల్లి ప్రధాన రహదారి వద్ద గ్రామస్తులు శనివారం ఆందోళన చేశారు. పెందుర్తి నుంచి ఎస్.కోట వరకు ఉన్న ప్రధాన రహదారి విస్తరణకు సంబంధించి అధికారులు నిర్వాసితులు, రైతులకు నోటీసులు ఇవ్వకుండా సర్వే చేపట్టారంటూ నిరసన వ్యక్తం చేశారు. పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు త్వరలోనే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.దేవిసాంబ, స్థానిక నాయకుడు జేసీబీ ప్రసాద్ మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదన్నారు. బాధితులకు నష్టపరిహారం తగ్గించేందుకు అధికారులు రోడ్డుకు ఒక్క పక్క మాత్రమే రహదారి విస్తరణ చేస్తున్నారని ఆరోపించారు. సరైన హామీ ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



యోగాసనాల్లో పలు పాఠశాలలకు చెందిన బాలికలు

సబ్బవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సబ్బవరంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. స్థానిక ప్రతిభా విద్యాలయంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో విద్యార్థిని, విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించినట్టు క్రీడా పోటీల కన్వీనర్ తిరుపతిరావు తెలిపారు.

ఆయా క్రీడల్లో విజేతలు వీరే

వాలీబాల్ అండర్–14: బాలికల విభాగంలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టు విన్నర్స్‌గా నిలవగా, మినర్వా జట్టు రన్నర్స్‌గా నిలిచారు.

వాలీబాల్ అండర్–17: ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టు విన్నర్స్‌గా నిలవగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

త్రోబాల్ అండర్–14: ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా.. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

కబడ్డీ అండర్–14: నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా.. కేజీబీవీ సబ్బవరం విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా.. ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

ఖోఖో అండర్–14: నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా, మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా, రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

బాలుర వాలీబాల్ అండర్–14: మదర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,మినర్వా పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: సబ్బవరం జీహెచ్ఎస్ విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,ఆరిపాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

త్రోబాల్ అండర్–14: మినర్వా పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,సబ్బవరం గురుకుల పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: మినర్వా పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,మల్లునాయుడుపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

కబడ్డీ అండర్–14: ఆరిపాక జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,రావలమ్మపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: రావలమ్మపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,మల్లునాయుడుపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

ఖోఖో అండర్– 14: మినర్వా పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,రావలమ్మపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

అండర్–17: మల్లునాయుడుపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు విన్నర్స్‌గా నిలవగా,ఆరిపాక జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు.

- యోగాసనాల బాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన అండర్–14 విభాగంలో 7గురు విద్యార్థులు,అండర్–17 విభాగంలో 6గురు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు పోటీల చైర్మన్ ఎస్. తిరుపతిరావు, కో ఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

పరవాడ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జైలు నుంచి బయటకు రావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శనివరాం పరవాడ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. చంద్రబాబుపై కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు.

రజకులను దూషించిన వారిపై చర్యలకు డిమాండ్




సమావేశంలో పాల్గొన్న రజక సంఘం నాయకులు

పరవాడ: సమాజంలో గౌరవ మర్యాదలతో బతుకుతున్న రజకులను కులం పేరుతో దూషించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘ చైర్మన్ పొన్నాడ మోహన్‌రావు డిమాండ్ చేశారు. తానాం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక జాతి మనోభావాలు దెబ్బతినేలా ప్రముఖ చానల్‌లో మాట్లాడిన మహిళ, ఆమె ఇంటర్వ్యూను ప్రచారం చేసిన చానల్ యాజమాన్యం కూడా రజకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జీవో 504 ప్రకారం కులం పేరుతో దూషించిన మహిళపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఏ ఒక్కరూ రజక జాతిని కులం పేరుతో విమర్శించి వారి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం మానుకోవాలని రజక సంఘ చైర్మన్ మోహన్‌రావు హితవు పలికారు. సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా సంఘ అధ్యక్షుడు తోకాడ రాము, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అద్దూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వి.రాము, గౌరవఅధ్యక్షుడు కె.జైనాథ్, సత్తిరాజు,పి.గురునాధరావు, రాము, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

ఉక్కునగరం: ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రం పక్కన ఉన్న విశ్వకర్మ ఆలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. విశ్వకర్మ పూజా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న వేడుకలకు స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఉన్నతాధికారులు, కార్మిక నాయకులు హాజరవుతున్నారు. అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చేపడుతున్న చర్యలకు ప్రయాణికులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ కోరారు. ఆయన గోపాలపట్నం ట్రాఫిక్ స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ చాలా కష్టమవుతుందని తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో జంక్షన్ వద్ద నాలుగు రోడ్ల నుంచి వాహనాలు నియంత్రణ లేకుండా వస్తున్నాయన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బీఆర్‌టీఎస్ రహదారికి ఎప్రోచ్‌గా ఉన్న సుసర్ల కాలనీ రహదారి, పాత గోపాలపట్నం రహదారి ఇరుగ్గా ఉండడం వల్ల వాహన దారులు ఆయా రహదారుల్లో ఆగకుండా బీఆర్‌టీఎస్ రోడ్డు వరకు వచ్చి ఆగుతున్నారని తెలిపారు. దీంతో సర్వీసు రోడ్డులో వచ్చే వాహన దారులు ఢీకొట్టే పరిస్థితి నెలకొంటుందని వివరించారు. ఇటీవల జంక్షన్‌లో ఒకవైపు బ్లాక్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అభ్యంతరాల మేరకు తొలగించామన్నారు.

సిగ్నల్ లైట్లు ఉపయోగిస్తాం

బాజీ జంక్షన్‌లో సిగ్నల్ లైట్లు ఉపయోగించేందుకు ట్రైల్స్ వేస్తామన్నారు. సుసర్ల కాలనీ నుంచి వచ్చే వెళ్లేందుకు ద్విచక్ర వాహనాలకే అనుమతించే విధంగా సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్లు ఆటోలు ప్రత్యామ్నాయ రహదారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలకు స్థానికులు సహకరించాలని కోరారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.